
పెనుమూడి పల్లెపాలెంలో వరద నీటిలో పాత్రలు శుభ్రం చేసుకుంటున్న ఓ మహిళ


రేపల్లె మండలం పెనుమూడి పల్లెపాలెంలో ఇళ్లను చుట్టుముట్టిన వరద నీరు

ప్రభుత్వం ఆదుకోవాలి



పెనుమూడి పల్లెపాలెంలో 36 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నా. పల్లెలో చిన్నపాటి బడ్డీ పెట్టుకుని వ్యాపారం చేసుకుంటూ జీవనం గడుపుతున్నా. వరదలు రావటంతో బతుకు జీవుడా అంటూ పునరావా కేంద్రానికి వచ్చా. వరదల తాకిడికి బడ్డీ దెబ్బతింది. మరమ్మతులు చేయించుకోవడం నాకు భారమే. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– జవ్వాది సుబ్బారావు, పెనుమూడి పల్లెపాలెం, రేపల్లె

దెబ్బతిన్న ఇళ్లు



కృష్ణా నదికి ఇంత వరదలు రావడం నేనిప్పటి వరకు చూడలేదు. చిన్నతనం నుంచి పల్లెపాలెంలోనే ఉంటున్నా. ఇప్పటికి అనేకమార్లు వచ్చినా ఇంత పెద్ద వరద చూడటం మొదటిసారి. వరదల తాకిడితో పల్లెపాలెంలోని ఇళ్లన్నీ దెబ్బతిన్నాయి. కూలీ పనులు చేసుకునే మా కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి.

– శీరంశెట్టి సామ్రాజ్యం, పెనుమూడి పల్లెపాలెం, రేపల్లె

ఇంటి నిండా బురద



వరదలు రావడంతో ఇళ్లు మునగడంతో విలువైన సామానులతో పునరావాస కేంద్రానికి వెళ్లాం. మూడు రోజులపాటు వరద నీటిలోనే ఇళ్లు ఉన్నాయి. నీరు తగ్గాక వచ్చి చూస్తే ఇంటి నిండా బురద చేరింది. శుభ్రపరుచుకోవడం యుద్ధంలా అనిపిస్తోంది. నీచు వాసన పోవడం లేదు.

– కొక్కిలిగడ్డ నాగలక్ష్మి, పెనుమూడి పల్లెపాలెం, రేపల్లె

విష పురుగులతో భయం



గతంలో ఎన్ని వరదలు వచ్చినా ధైర్యంగా ఇంట్లోనే ఉండేవాళ్లం. ప్రస్తుతం వచ్చిన వరద ఉధృతిని చూసి భయంతో పునరావాస కేంద్రానికి పరుగులు తీశాం. వరద తగ్గాక ఇంటిని చూస్తూ భయమేస్తోంది. ఇంట్లో నాలుగు అంగుళాల మేర మట్టి పేరుకుపోయింది. వాటితో పాటు విషపురుగులు చేరాయి. దీంతో ఏ సమయంలో ఏం జరుగుతుందోనని భయమేస్తోంది.

– కొక్కిలిగడ్డ పుష్పావతి, పెనుమూడి పల్లెపాలెం, రేపల్లె

కట్టుబట్టలతో మిగిలాం



కూలీ నాలీ చేసుకుంటూ కృష్ణమ్మ పంచన పడి ఉంటూ జీవనం సాగిస్తున్నాం. కృష్ణానదికి వచ్చిన వరదతో మా ఇల్లు నీట మునిగి పడిపోయింది. వస్తువులు సైతం వరదలో కొట్టుకుపోయాయి. మా కుటుంబం నడిరోడ్డుపై ఉంది. వంట చేసుకోవటానికి సైతం ఒక పాత్ర కూడా మిగలలేదు. కట్టుబట్టలతో మిగిలాం. ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలి.

– సమ్మెట లక్ష్మి, పెనుమూడి పల్లెపాలెం, రేపల్లె

పక్కా గృహాలు కట్టించాలి



వరదలు వచ్చిన ప్రతిసారి పునరావాస కేంద్రాలకు వెళ్లడం, తగ్గాక ఇళ్లు బాగు చేసుకోవడం పరిపాటిగా మారింది. వరదల సమయంలో వచ్చే నాయకులు, అధికారులు శాశ్వత గృహాలు ఏర్పాటు చేస్తామని చెబుతున్నారే గానీ ఆచరణలోకి తీసుకు రావడంలేదు. ప్రభుత్వం స్పందించి స్థలాలు మంజూరు చేసి, పక్కా గృహాలు నిర్మించి అందించాలి.

– ఎస్.సామ్రాజ్యం, పెనుమూడి పల్లెపాలెం, రేపల్లె

లంకలు విలవిల

నాలుగు రోజులుగా కృష్ణా వరద నీటిలో లంక గ్రామాలు విలవిలలాడుతున్నాయి. నీటిలో తడిసి చాలా ఇళ్లు కూలాయి. తలదాచుకుందామంటే గూడు లేదు. ఉన్న ఇళ్లు బురదగుంటలుగా మారాయి. టీవీ, ఫ్రిజ్‌లతోపాటు అన్ని వస్తువులు పాడయ్యాయి. వంట పాత్రలు పనికిరాకుండా పోయాయి. బట్టలు, విలువైన పత్రాలు, పిల్లల పుస్తకాలు తడిసి ముద్దయ్యాయి. పంటలు వరదలో చిక్కుకున్నాయి. ఒక్కో ఇంటికి నష్టం రూ. లక్షల్లో ఉంది. ప్రాణప్రదంగా చూసుకునే పశువులకు గ్రాసం లేక అల్లాడుతున్నాయి. విద్యుత్ సరఫరాలేక 27 గ్రామాల్లో అంధకారం అలుముకుంది. జనం విష పురుగులు, దోమలతో అల్లాడుతున్నారు. – సాక్షి ప్రతినిధి, బాపట్ల


పెనుమూడి పల్లెపాలెంలో ఇంట్లోని నీటిని బయటకు పోస్తున్న మహిళ


భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెంలో వరదకు మేట వేసిన ఒండ్రును చూపుతున్న మహిళ


పెనుమూడి పల్లెపాలెంలో ఇంటిలోకి చేరిన బురద


పెనుమూడి పల్లెపాలెంలో సామగ్రిని శుభ్రపర్చుకుంటున్న మహిళ

కూడు పోయింది.. గూడు చెదిరింది

- నిరాశ్రయులపై సర్కార్ నిర్లక్ష్యం
- సాయం కోసం ఎదురుచూపు
- వరద పోయినా వదలని బురద కష్టాలు
- వరద నీటిలో కుళ్లి పోయిన పంటలు
- వంట సామగ్రి, బట్టలు నీటిపాలు
- తడిసి ముద్దయిన తిండి గింజలు
- విద్యుత్ సరఫరా లేక నాలుగు రోజులుగా అంధకారం
- 'సాక్షి' ప్రతినిధి ముందు బోరుమన్న వరద బాధితులు



భట్టిప్రోలు మండలం లంక గ్రామాలకు ట్రాక్టర్‌పై తరలుతున్న ప్రజలు

భోజనం సంగతి దేవుడెరుగు గుక్కెడు నీటి కోసం లంక గ్రామాలు ప్రజలు అల్లాడుతున్నారు. ఇప్పుడు వరద తగ్గింది. ఇళ్లలో చేరిన బురదను తొలగించడం కష్టంగా మారింది. నిన్నటిదాకా ఇంటినిండా వరద నీరు. ఇప్పుడు బురదను కడుక్కుందామన్నా చుక్క నీరు దొరకడంలేదు. బురదను తొలగించుకునేందుకు కూలీలు కూడా అందుబాటులో లేరు. గోరుచుట్టపై రోకటి పోటు అనే చందంగా పరిస్థితి ఉందని బాధితులు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ సాయంకోసం ఎదురుచూపులు చూస్తున్నారు. అయినా చంద్రబాబు ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా లేదు.

జ్వరాల విజృంభణ

వరద ప్రభావంతో లంక గ్రామాల్లో పలువురు జ్వరాల బారినపడ్డారు. బయట ఆస్పత్రులకు వెళ్లలేని పరిస్థితి. ముంపువాసుల్లో చాలామంది పేదలు. రెక్కాడితేగానీ డొక్కాడని వారున్నారు. వారంరోజులుగా వారికి పనుల్లేవు. ఈ పరిస్థితుల్లో ఆస్పత్రికి వెళ్లి చూపించుకోవాలంటే వేలకు వేలు కావాల్సిందే. చాలామంది డబ్బుల్లేక లంకల్లోనే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. బయటకు వచ్చి చూపించుకుందామన్నా ప్రభుత్వం కనీసం బోట్లు ఏర్పాటు చేయలేదు.

బాబు హామీ గాలికి ..

చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు తుపాను, వరదల్లో నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ. 20 వేలకు తగ్గకుండా పరిహారం ఇవ్వాలని నాడు వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని నేడు పలువురు లంకగ్రామాల రైతులు గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలో ఉన్న చంద్రబాబు తగినంతగా పరిహారం అందజేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మూగజీవాల అరణ్యరోదన

నాలుగు రోజులుగా వరద నీటిలో చిక్కుకున్న వేలాది పశువులు గ్రాసం కోసం అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ముంపులో ఉన్న లంక గ్రామాల్లో వేలాది పశువులు పస్తులతో అల్లాడుతున్నాయి. బుధవారం జిల్లా కలెక్టర్‌తోపాటు కొందరు ప్రజాప్రతినిధులు, పశుసంవర్ధకశాఖ దాణా అందిస్తున్నట్లుగా ఫొటోలకు ఫోజులిచ్చారు. ఎంతమందికి ఇచ్చారంటే శాఖ అధికారులు స్పందించడంలేదు. కానీ క్షేత్రస్థాయిలో బాధిత రైతులందరికీ దాణా ఇవ్వలేదు. మొక్కుబడిగా ఇచ్చి చేతులు దులుపుకున్నారు. నాలుగు రోజుల వరద పుణ్యమాని వేమూరు, రేపల్లెతోపాటు జిల్లావ్యాప్తంగా రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా కృష్ణా నది ముంపు ప్రాంతాలలో దెబ్బతినడంతో గ్రామాలకు రాకపోకలకు వీల్లేకుండా ఉంది. అరవింద వారధిపై బురదతోపాటు చెత్త పెద్దఎత్తున చేరింది.


భట్టిప్రోలు మండలం పెదలంకలో ఓ ఇంట్లో తేలు

అంధకారంలోనే లంకగ్రామాలు

కృష్ణాకు వరద సంభవించి నాలుగు రోజులైనా లంక గ్రామాల్లో విద్యుత్‌ను పునరుద్ధరించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలు అంధకారంలో అల్లాడి పోతున్నారు. దోమలు, విషపురుగుల నుంచి తప్పించుకునేందుకు నానాతంటాలు పడుతున్నారు. విద్యుత్‌ను తక్షణం పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నా అధికారులు స్పందించడంలేదు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో 2023 డిసెంబర్ 5న జిల్లాలో మిచాంగ్ తుఫాను ప్రభావంతో 261 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. అయితే, అధికారులు రెండవరోజు సాయంత్రానికే సరఫరాను పునరుద్ధరించారు.

అందని ప్రభుత్వ సాయం

లంక గ్రామాల ముంపు బాధితులకు ఇప్పటివరకూ ప్రభుత్వం సాయం అందించలేదు. తూతూమంత్రంగా భోజనం, తాగునీటిని మాత్రమే సరఫరా చేసి చేతులు దులుపుకున్నారు. అదికూడా అధికారుల ద్వారా అని చెబుతున్నా..పచ్చపార్టీ నేతలకే బాధ్యతలు అప్పగించడంతో ఒక వర్గం వారికే అందుతోంది. ప్రధానంగా పేదలు, ఎస్సీ కాలనీలకు సాయం అందడంలేదు.


పెనుమూడి పల్లెపాలెంలో ఇళ్ల చుట్టూ చేరిన వరద నీరు

పంటలకు భారీ నష్టం

వర్షాలు, వరదల ప్రభావంతో జిల్లాలో పెద్దఎత్తున పంటలు నీటమునిగి దెబ్బతిన్నాయి. వాటి అంచనాలు రూపొందించడంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మంగళవారం నాటికి జిల్లాలో 33,769 హెక్టార్లలో వరి, 4500 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని అధికారులు చెబుతున్నా ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశముంది. వివరాల కోసం అధికారులను సంప్రదించినా స్పందించడంలేదు.

వరద ముంపు ప్రాంతాల ప్రజలను ఆదుకుంటాం

రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె రూరల్: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వరద బాధిత ప్రాంతాలకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని పెనుమూడి నుంచి లంకెవానిదిబ్బ వరకు వరద ముంపు ప్రాంతాల్ని విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవితో కలిసి బుధవారం పర్యవేక్షించి అనంతరం మాట్లాడారు. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో నష్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి ప్రజల్ని ఆదుకుంటామని తెలిపారు. మెడికల్ క్యాంప్‌లు నిర్వహించి ప్రజలకు వైద్యసేవలు అందిస్తామని పేర్కొన్నారు.

ఆందోళన వద్దు : కలెక్టర్

వేమూరు: వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు ఆందోళన చెందవద్దని, ఆదుకుంటామని కలెక్టర్ వెంకట మురళి హామీ ఇచ్చారు. కొల్లూరు మండలం పెసర్లంకలో వరద బాధితుల వద్దకు బుధవారం ఆయన వెళ్లారు. లంక గ్రామాల్లో ప్రభుత్వ సహాయక చర్యలు గురించి గ్రామస్తుల్ని అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరా చేస్తామని కలెక్టర్ చెప్పారు.

తీరానికి క్షేమంగా చేరిన మత్స్యకారులు

ఫలించిన జిల్లా అధికారుల కృషి

చినగంజాం: జీవనోపాధి కోసం వేటకు వెళ్లి ఆచూకీ తెలియని మత్స్యకారులు ఎట్టకేలకు బుధవారం తీరానికి క్షేమంగా చేరుకున్నారు. విశాఖపట్టణంలోని సముద్ర తీరంలో ఆచూకీ కోల్పోయిన వారికి బంధువులతో సమాచార సంబంధాలు తెగిపోవడంతో వారు తప్పిపోయారనే విషయం బయటకు వెల్లడైంది. 10 మందిలో నలుగురు మత్స్యకారులు చినగంజాం మండలానికి చెందిన వారు కావడంతో వారి బంధువులు కలెక్టర్ వెంకట మురళికి ఫిర్యాదు చేయడంతో ఆయన స్పందించారు. వారి ఆచూకీ కనిపెట్టేందుకు చర్యలు చేపట్టారు. విశాఖ పట్టణం, బాపట్ల జిల్లాల కలెక్టర్లు, మత్స్యశాఖ అధికారులు, కోస్ట్ గార్డులతో సమన్వయం చేసుకొని విశాఖ సముద్రంలో 150 కి.మీ. దూరంలో చిక్కుకున్న మత్స్యకారులను బయటకు తీసుకొని వచ్చేందుకు కృషి చేశారు. దీంతో మత్స్యకారుల బంధువుల్లో ఆనందం వెల్లివిరిసింది. బతుకుదెరువు కోసం గత నెల 23న చినగంజాం మండలం మోటుపల్లి పంచాయతీ రుద్రమాంబపురం గ్రామానికి చెందిన మత్స్యకారులు కొండూరి రాముడు, బసన్నగారి జయరాజు, కాటం బాబూరావు, ఆవల మునియ్య మరో ఆరుగురు కలిసి చెన్నై నుంచి విశాఖపట్టణానికి ఐరన్ బోటులో చేపల వేటకోసం వెళ్లారు. అయితే నాలుగు రోజులు కిందట విశాఖ పట్టణానికి 50 నాటికల్‌మైళ్ళ దూరంలో బోటు ఇంజన్ మరమ్మతులకు గురవడంతో వారు సముద్రంలో చిక్కుకుపోయారు. సమాచారాన్ని సహచర మత్స్యకారులు చెన్నైలోని బోటు యజమానికి సమాచారం అందించారు. అదే సమయంలో వారి బంధువులు స్థానికంగా కలెక్టర్ దృష్టికి సమాచారాన్ని తీసుకొని వెళ్లడంతో స్పందించిన అధికారులు మంత్రులు, రెవెన్యూ, ఫిషరీస్, కోస్ట్‌గార్డ్‌ల సాయంతో విశాఖ సముద్రంలో బోటు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే రెండో రోజు బోటుకు మరమ్మతులు చేయించి మూడో రోజు కాకినాడ తీరానికి చేర్చేలా చర్యలు తీసుకున్నారు. మత్స్యకారులు తాము క్షేమంగా ఒడ్డుకు చేరేందుకు చర్యలు తీసుకున్న రాష్ట్ర మంత్రులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.


కాకినాడ తీరానికి చేరుకున్న తప్పిపోయిన మత్స్యకారులు

ఇంటింటా ఈతి బాధలు

- గంగ పుత్రులకు తీవ్ర నష్టం
- కడలిపాలైన గృహోపకరణాలు
- నేలకొరిగిన పూరిళ్లు
- కట్టుబట్టలతో మిగిలిన బాధితులు
- రూ. లక్షల్లో నష్టం
- ఇళ్లలోకి చేరిన మట్టి మేటలు

రేపల్లె రూరల్ : కృష్ణమ్మ విలయతాండవం మండలంలోని పెనుమూడి పల్లెపాలెం గంగపుత్రలకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. గ్రామస్తులు కట్టుబట్టలతో మిగిలారు. వరద ఉధృతి తగ్గినా వెతలు తప్పటంలేదు. గతంలో ఎన్నడూలేని విధంగా రికార్డు స్థాయిలో 11.26లక్షల క్యూసెక్‌లు రావడంతో గ్రామంలో ఇళ్లు పూర్తిగా నీటమునిగాయి. పది అడుగుల మేరనీరు చేరింది. గ్రామంలో 120కు పైగా ఇళ్లు ఉన్నాయి. వరద తాకిడితో పలు ఇళ్లు నేలకొరగాయి. గోడలు పూర్తిగా దెబ్బతినడంతో పాటు ఇళ్ల చుట్టూ ఏర్పాటు చేసుకున్న దడులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. ఇళ్లలోకి ఆరు అంగుళాల మేర మట్టి మేటలు చేరాయి. పునరావాస కేంద్రాల నుంచి ఇళ్లకు చేరని గ్రామస్తులు దృశ్యాల్ని చూసి ఆవేదన చెందుతున్నారు. ప్రతి ఇంటిలో, వాకిళ్లల్లో చేరిన మట్టి మేటలను తొలగించుకునే పనిలో ఉన్నారు. మూడు రోజులు నీటిలో నానిన వస్త్రాలను శుభ్రం చేసుకునేందుకు నీరు లేకపోవడంతో ఇళ్ల ముందు రహదారిపై ఉన్న వరద నీటిలోనే శుభ్రం చేసుకుంటున్నారు. వంట సామగ్రితో పాటు దుస్తులు వరద పాలవ్వడంతో కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫ్రిజ్‌లు, టీవీలు వంటి విలువైన సామగ్రి వరద నీటిలో తడవడంతో పూర్తిగా పాడైపోయినట్లు వాపోతున్నారు.


దుస్తులను శుభ్రం చేసుకుంటున్న మహిళలు


ఇళ్లలోకి చేరిన మట్టి మేటలు